17)మలహరి

ప॥ అంతరుమాలినయట్టి అధములాల। పొంత సంతకూటమి పొరిచూపు గాదా॥

చ॥ కనక మిత్తడితోడ కలయ సరిదూచితే। అనువవునా అది దోష మవుగాక।
ఘనుడైనహరితో గడుహీనదేవతల। ననిచి సరివేట్టితే నయ మవునా భువిని॥

చ॥ పట్టభద్రుడు గూర్చుండేబలుసింహాసనముపై। వెట్టిబంటు బెట్టేవారు వెఱ్ఱులేకారా।
గట్టిగా శ్రీహరితోడ కలగంపదేవతల। బెట్టి కొలుచుట విందువెట్టి పగగాదా॥

చ॥ కొంచక సింహముండేటిగుహ నుండవచ్చునా। పొంచి నక్కలకెల్ల బొక్కలేకాక।
అంచెల శ్రీవేంకటేశు డాత్మలోనే వుండగాను। కొంచెపుదైవాల పలువంచలనేకాక॥